

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శనివారం,22 నవంబర్ 2025

8 పేజీలు


## ఎక్కువ విదేశీ మారక ద్రవ్యం అందిస్తున్న

# మత్స్య సంపద

- కేంద్ర మంత్రి వర్మ, మంత్రి నిమ్మల, ఎంపి పాకా, ఎమ్మెల్యే బొమ్మిడి, కలెక్టర్ నాగరాణి







**నరసాపురం,మేజర్‌న్యూస్:** భారత దేశానికి పెద్ద ఎత్తున విదేశీ మారకద్రవ్యాన్ని అందిస్తున్న పరిశ్రమ మత్స్య సంపదఅని, దీనికి కారణం మత్స్యకారులే అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయం మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.ప్రపంచ మత్స్య దినోత్సవ సందర్భంగా నరసాపురం శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన భారీకార్యక్రమంలోవిశిష్ట అతిథులుగా పలువురు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తొలుత జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.సమావేశంలో కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ సముద్ర, దేశీయ నది జలాలను పరిరక్షించి భావితరాలకు మత్స సంపదను అందించే లక్ష్యంతో 1997 సంవత్సరంలో 18 దేశాల ప్రతినిధులతో న్యూఢిల్లీలోని వరల్డ్ ఫోరం ఆఫ్ ఫిష్ హార్వెస్టర్స్ అండ్ ఫిష్ వర్కర్స్ అనే సంస్థ ప్రతి సంవత్సరం నవంబర్ 21న ప్రపంచ మత్స్య దినోత్సవంను జరుపుకోవడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. భావితరాలకు మత్స్య సంపదను అందించడమే కాకుండా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి సుస్థిరమైన ఆర్థిక భరోసాను కల్పించడమే లక్ష్యం అన్నారు.ఎన్డీఏ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యేను, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌ను ఈ ప్రాంతం వారినే, మత్స్య వర్గాలనే నియమించడం రాజకీయంగా కూడా పైకి తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నదన్నారు.మత్స్యకారులకు ప్రమాద ఎక్స్‌గ్రేషియా,50 సంవత్సరాలకు పించనుకు ఒకఆలోచన చేస్తామన్నారు.మత్స్యకారుల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకోలేని వారి విద్యను కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా మీ శాసనసభ్యులతో కలిసి ఆలోచన చేస్తానన్నారు.డ్రై ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు

- తరువాయి 2లో..




## ఎన్‌కౌంటర్లపై

# న్యాయవిచారణ జరపాలి

- ఈనెల 23న నిరసనలు

: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో జరిగిన ఎన్కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం ఏలూరు జిల్లా సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నందు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హిడ్మాతో సహా 13 మంది మావోయిస్టులు మరణించారని పోలీసులు చెబుతున్నప్పటికీ,అడవుల నుంచి బయటకు వచ్చి పట్టణ,నగర ప్రాంతాలలో తలదాచుకున్న వారిని పట్టుకుని అడవులకు తీసుకువెళ్లి ఎదురుకాల్పుల పేరిట కాల్చి చంపుతున్నారని విమర్శించారు.విజయవాడ,ఏలూరు,ఇతర ప్రాంతాలలో నిర్బంధించిన మావోయిస్టులను,అమాయక గిరిజనులను వెంటనే సంబంధిత న్యాయస్థానాల ముందు హాజరుపరచాలని డిమాండ్ చేశారు.ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఈనెల 23న వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పట్టణ, నగరాలలో, నిరసనలు తెలుపుతున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో రైతు పండించిన పంటలకు మద్దతు ధర లేదని,అరటి రైతులు సరైన ధరలులేక నష్టాల పాలవుతున్నారని విమర్శించారు. ఎస్.సి.,ఎస్.టి.,బి.సి., మైనారిటీ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు.

- తరువాయి 2లో..

## వైఎస్ఆర్సిపి జోన్ -2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నౌడు వెంకటరమణ



**ఉంగుటూరు,మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్సిపి జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైఎస్ఆర్సిపి సీనియర్ నేత, ఉంగుటూరు నియోజకవర్గ యువనేత నౌడు వెంకటరమణ నియమితులయ్యారు.ఈ మేరకు వైఎస్ఆర్సిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం వెంకట రమణ వైఎస్ఆర్సిపి బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. వైఎస్ఆర్సిపి బీసీసెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్రమంతా కలియ తిరుగుతూ బీసీల ఐక్యమత్యం సమస్యల

- తరువాయి 2లో..

## 24న జరిగే డిప్యూటీ సిఎం పర్యటనకు పటిష్ట భద్రత

- ఎక్కడ ఒక చిన్న పొరపాటు కూడా జరగకుండా పనులు వేగవంతం
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టరు కె.వెట్రిసెల్వి,ఎస్పి ప్రతాప్ శివ కిషోర్



కొయ్యలగూడెం/ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:



## సీ.ఎం.చంద్రబాబు హామీకి 11 ఏళ్ళు

## కల..గానే మిగిలిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం !

**కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెంలో చిరువ్యాపారులు అయిదు దశాబ్ధాలుగా కోరుకుంటున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం స్వప్నం నిజంగానే...కలగానే మిగిలిపోయింది.చంద్రబాబు2014సం.రం ఎన్నికల్లో గెలిచి సీఎం అయిన తరువాత ఆ ఏడాది జూలై 17న మండలంలోని ఆరిపాడుదిబ్బలు (కనకాద్రిపురం) వద్ద 30వేల మంది డ్వాక్రా మహిళలతో ముఖాముఖి సమావేశానికివచ్చారు.ఆసందర్భంగా కొయ్యలగూడెం ప్రధాన కూడలిలో ప్రసంగిస్తూ స్థానిక ప్రజలు, ఎమ్మెల్యే,ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు కోరిన ప్రకారం పోలీస్ స్టేషన్ స్థలంలో చిరు వ్యాపారుల కోసం దుకాణ సముదాయాన్ని ప్రభుత్వం నిర్మిస్తుందని హామీ ఇచ్చారు.నాటి సీఎం హామీకి 11ఏళ్ళు గడిచాయి. అయినా, ఆయన హామీ కానీ, వ్యాపారుల స్వప్నం కానీ నెరవేరలేదు.ఆ తరువాత 2022 మే3నఅప్పటి జంగారెడ్డిగూడెం డీఎస్పీ వెంకట్రావు కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద స్థానిక బ్యాంకు అధికారులు మరియు పట్టణ వ్యాపారులతో దాదాపు రెండుగంటలపాటు ఇక్కడ నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించారు.

పోలీస్ స్టేషన్ స్థలంలో మూడువైపులా గ్రౌండ్ ఫ్లోర్‌లో 68 దుకాణాలు, మొదటి అంతస్తులో 68 దుకాణాలు మొత్తం 136 దుకాణాలు నిర్మించడానికి రూ.4.90కోట్లుతో అప్పుడు రూపొందించిన అంచనా ప్రతిపాదనలకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ డిజైన్ కు సంబంధించి ప్రతిపాదనలు వివరించారు. గ్రౌండ్ ఫ్లోర్ లో ముందు వైపున దుకాణాలు,వాటి వెనుక వైపున పార్కింగ్ సదుపాయానికి చోటు కల్పించినట్లు తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో




- తరువాయి 2లో..

# 24న జరిగే డిప్యూటీ సిఎం పర్యటనకు పటిష్ట భద్రత

**కొయ్యలగూడెం/ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** కొయ్యలగూడెం మండలం రాజవరం శుక్రవారం సాయంత్రం పెద్ద చెరువు సమీపంలో ఉన్న దేవుడు మాన్యం నందు హెలిప్యాడ్ ను, ద్వారకాతిరుమల మండలం ఐయస్ జగన్నాధపురం లో మ్యాజిక్ డ్రైన్‌ను, శ్రీలక్ష్మీనరసింహా స్వామి వారి దేవస్థానం ప్రాంగణాన్ని, శ్రీ మహదర్శన నవ నరసింహా యజ్ఞశాలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్,జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ,ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంయుక్తంగా పరిశీలించారు.అనంతరం దేవాలయ ప్రాంగణంలో వివిధ శాఖలు అధికారులు, దేవాలయం అధికారులతో అత్యవసర సమావేశాన్ని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంయుక్తంగా నిర్వహించారు.హెలిప్యాడ్ నిర్మాణం అత్యంత పకడ్బందీగా చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. భారికేడింగు, ఐరన్ మెస్‌లు ఏర్పాట్లను సకాలంలో పూర్తి చెయ్యాలని ఆదేశించారు. పార్కింగు ప్లేస్లు, ట్రాపిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.విద్యుత్తుకు ఏటువంటి అంతరాయం కలగకుండా అవసరమైన విద్యుత్ లైన్స్ ఏర్పాటు చేయడంతో పాటు, జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. కొయ్యలగూడెం మండలం రాజవరం పెద్ద చెరువు సమీపంలో ఉన్న దేవుడు మాన్యం నందు హెలిప్యాడ్‌లో దిగుతారని, ద్వారకాతిరుమల మండలం ఐయస్ జగన్నాధపురంలో మ్యాజిక్ డ్రైన్‌ను, కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని అన్నారు. శ్రీలక్ష్మీనరసింహా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

అనంతరం దేవాలయం కొండ క్రింద పాత్రికేయులు సమావేశాన్ని నిర్వహిస్తారని తెలిపారు.ఉప ముఖ్యమంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు కార్యక్రమాలు దేవాలయం కొండ క్రింద యల్ఇడి స్క్రీన్లు ప్రజలు తిలకించుటకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఉప ముఖ్యమంత్రి హెలిప్యాడ్ ల్యాండు అయిన దగ్గరనుండి తిరిగి వెళ్ళేవరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో యం.వి.రమణ,వివిధ శాఖలు జిల్లా, మండల అధికారులు, దేవాలయ అధికారులు,కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# అధునాతన గణిత భావనలు, ఔచిత్యం పై అవగాహన





**ఏలూరు,మేజర్ న్యూస్:** గణిత శాస్త్రాలు, సాంకేతికతలో ఉద్భవిస్తున్న ధోరణులు" అనే అంశంపై జరిగిన లెక్చర్ వర్క్షాప్ రెండవ రోజు సెషన్ లలో అధునాతన గణిత భావనలు ఆధునిక సాంకేతికతలో వాటి ఔచిత్యం గురించి చర్చించారు.చెన్నైలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్ నుండి ప్రొఫెసర్ బాలసుబ్రమణియన్, సురక్షిత కమ్యూనికేషన్ వ్యవస్థలలో సంఖ్య సిద్ధాంతం, దాని అనువర్తనాలపై ఉపన్యాసం ఇచ్చారు.ఐఐటీ తిరుపతి నుండి డాక్టర్ బిదిషా రాయ్ ప్రధాన సంఖ్యల పంపిణీపై రెండు సెషన్లను నిర్వహించారు.

ఢిల్లీలోని శివ్ నాడార్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ నుండి ప్రొఫెసర్ టి.ఎస్.ఎస్.ఆర్.కె. రావు, ఉత్తమ ఉజ్జాయింపు ద్వారా ఆప్టిమైజేషన్లో పద్ధతులను వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో వాటి ప్రయోజనాన్ని వివరించారు.శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, సర్ సిఆర్రెడ్డి కాలేజ్ ఫర్ ఉమెన్, సర్ సిఆర్రెడ్డి కాలేజ్ (ఎ), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఏలూరు, సిహెచ్.డి.సెయింట్ థెరిసా కాలేజ్ ఫర్ ఉమెన్ (ఎ) ఇతర సంస్థల నుండి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమన్వయకర్త గణిత శాస్త్ర విభాగాధిపతి గోపీనాథ్ యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ సీనియర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీనియర్ సునీలా రాణి, పీజీ డైరెక్టర్, పరీక్షల కంట్రోలర్ డాక్టర్ సీనియర్ సుశీల, రిసోర్స్ పర్సన్లు, డిపార్ట్మెంట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎక్కువ విదేశీ మారక ద్రవ్యం అందిస్తున్న మత్స్య సంపద

మొదటిపేజి తరువాయి

50లక్షలు రూపాయల నిధులను సమకూరుస్తానని, అలాగే మత్స్యకార గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులను సమకూర్చడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పరిష్కరించుకొని మత్స్యకార సోదర సోదరీమణులందరికీ ముందుగా హృదయపూర్వక శుభాకాంక్షలను తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత్స్య సంపద ఏదైతే ఉందో అదేవిధంగా ఆక్వాకు సంబంధించినటువంటి అపార వనర్లు మన ప్రాంతంలో ఉన్నాయన్నారు.అగ్రగామిగా ఉండడానికి ఆనాడు ఎన్టీఆర్ దగ్గరనుంచి ఈరోజు చంద్రబాబునాయుడు వరకు మత్స్య సంపదకు చేసినటువంటి కృషికి ప్రతిఫలం అనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా మనందరం కూడా గుర్తుపెట్టుకోవాల్సినటువంటి అవసరం ఉందన్నారు. మత్స్యకారుల జీవన శైలి, జీవన ప్రమాణాలు దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వం జారీచేసిన 217 జీవోను, కూటమి ప్రభుత్వం ఇచ్చినటువంటి మాటకు కట్టుబడి 217 జీవోను కూడా రద్దు చేయడం జరిగిందని తెలిపారు.నరసాపురం శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి నిరంత కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వ పథకాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.నియోజకవర్గం అభివృద్ధికి పక్క ప్రణాళికతో చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు ఏ సమస్య ఉన్న నా దృష్టి తీసుకురావచ్చని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కష్టజీవులు, గంగపుత్రులు, మత్స్యకారులు అందరికీ ఈరోజు ప్రపంచ మత్స్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.మన రాష్ట్రంలో, మన జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామని, వాటిని ప్రతి మత్స్యకార కుటుంబం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద మత్స్యకారులను ఒక వంద మందిని గుర్తించి రామకృష్ణ మిషన్ ద్వారా ఒక బోటు, వల ఒక్కొక్కరికి 70 వేల రూపాయలు విలువైనవి అందజేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ చైర్మన్ రామరాజు,రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు,రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, మాజీ శాసనసభ్యులు కొత్తపల్లి జానకిరామ్, తదితరులు మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి,రాష్ట్ర ఏపీ ఐఎస్ చైర్మన్ మంతెన రామరాజు,రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణ, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మైల వసంతరావు, నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పోత్తూరి రామరాజు, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు, కొత్తపల్లి జానకిరామ్,తాడేపల్లిగూడెం టిడిపి ఇన్చార్జ్ వల వల మల్లికార్జునరావు, ఆర్డీవో దాసిరాజు, తహసిల్దార్ ఐతం సత్యనారాయణ,స్థానిక ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరపాలి

మొదటిపేజి తరువాయి

పి.పి.పి.,పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వలన పేదలకు వైద్య విద్య అందరిని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.32 మంది ఆత్మబలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తుంటే మన రాష్ట్రానికి చెందిన 25 మంది పార్లమెంటు సభ్యులు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు.డిసెంబర్ 26వ తేదీన ఖమ్మం జిల్లాలో సిపిఐ శతవాసికోత్సవాల సభ 5 లక్షల మందితో ముగింపు సభ జరుగుతుందని, ఖమ్మం వేదికగా ప్రత్యామ్నాయ రాజకీయాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, తొర్లపాటి బాబు, నిమ్మగడ్డ నరసింహ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి జోన్ -2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నౌడు వెంకటరమణ

మొదటిపేజి తరువాయి

పరిష్కారం పార్టీ అభివృద్ధి నాయకులు కార్యకర్తలు మధ్య సమన్వయం పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా చేస్తున్న కృషి కి ఫలితంగా జోన్ -2 వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి రావడం పట్ల ఉంగుటూరు నియోజకవర్గంలో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వైఎస్ఆర్సిపి శ్రేణులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

## సీ.ఎం.చంద్రబాబు హామికి 11 ఏళ్ళు కల..గానే మిగిలిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం !

మొదటిపేజి తరువాయి

దుకాణాలు,వాహనాలపార్కింగ్‌స్థలం...మొదటిఅంతస్తులో బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, విద్యా సంస్థలు,సెమినార్ హాళ్ళు ,ఇతర కార్యాలయాలు ఏర్పాటుకు అనువుగా మరికొన్ని దుకాణాలను ఏర్పాటుకు అనువుగా ప్లింత్ ఏరియాను పెంచి,నిర్మించడానికి ప్రతిపాదనలు ఉన్నాయని ఆయన వారికి వివరించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే.. వాటికి ఉండే డిమాండు,అద్దెల పరిస్థితి గురించి, ప్లింత్ ఏరియా అవసరాల గురించి డిఎస్పీ..బ్యాంకులు, వ్యాపార వేత్తలు,ఇతర సంస్థల ప్రతినిధులతో చర్చించారు.అనంతరం ఆయన తనను కలిసిన విలేఖరులతో మాట్లాడారు. ఇక్కడ పోలీస్ స్టేషన్ స్థలంలో రెండతస్థులుగా నిర్మాణం తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్ పోలీసు ఉన్నత స్థాయి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని చెప్పారు. తరువాత 2016 జూలై 20న అప్పటి రాష్ట్ర పోలీస్ డీజీపీ జె.వి.రాముడు తాను పదవీ విరమణ చేయడానికి ఒకరోజు ముందు ఏలూరు వచ్చి, అక్కడి ఎస్పీ కార్యాలయ ఆవరణలో... కొయ్యలగూడెం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అక్కడే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తరువాత ఆ శిలాఫలకాన్ని కొయ్యలగూడెం తీసుకువచ్చి స్టేషన్ స్థలంలో ఏర్పాటు చేశారు.ఆ తరువాత 9 సంవత్సరాలు కాల గర్భంలో కలిసిపోయాయి.కానీ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరగలేదు. మళ్ళీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్,పోలవరం ఎమ్మెల్యే చిర్రబాలరాజు ఇక్కడకు వచ్చిన ప్రతిసారి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుందని,చిరువ్యాపారులను ఊరిస్తున్నారు. కానీ, అధికారికంగా ఏ ఆదేశాలు రావటం లేదు.అదిగో...అదిగో.. ఇదిగో..ఇదిగో అంటూ ఊరడింపులతోనే 11ఏళ్లకాలం గడిచిపోయింది. ఆశలు కార్యరూపం దాల్చేది ఎప్పటికో ?

## నేడు మండలంలో గ్రామ సభలు జరపాలి

**పోడూరు,మేజర్ న్యూస్:** పోడూరు మండలంలోని మండల ప్రజా పరిషత్-పోడూరు -మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పదకము 2025 2026 ఆర్థిక సంవత్సరములో - గ్రామ పంచాయతీ ల నందు డిలీట్ చేసిన జాబ్ కార్డుల గురించి ప్రత్యేక గ్రామ సభలు జరుగునని ఎంపీడీఓ మంగా కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.పోడూరు మండలములోని 16 గ్రామముల యందు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకము నందు నమోదు అయిన ప్రతి ఒక్క వేతనదారునికి ఇకెవైసి చేయవలసినదిగా ఆదేశించారు. సదరు తొలగించిన జాబ్ కార్డు లపై అన్నీ గ్రామ పంచాయతీలలో ఈ నెల 22వ తేదీన శనివారం మండలములోని 16 గ్రామాల్లో ఉదయం 9గం నుండి సా.4గం వరకు గ్రామసభలు నిర్వహించి సదరు గ్రామ సభ నందు తొలగించిన వారి పేర్లను చదివిగ్రామసభతీర్మానము ఆమోదించవలసినదిగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు గ్రామములో టాం టాం ద్వారా విస్తృత ప్రచారం చేసి గ్రామ సభలు సజావుగా జరుగుటకు చర్యలు తీసుకొనవలసినదిగా ఆమె సూచించారు.

# సెల్ వద్దు - పుస్తకాలు ముద్దు

**– గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలి**



**భీమడోలు,మేజర్ న్యూస్ :** 'సెల్ వద్దు. పుస్తకాలు ముద్దు.' విద్యార్థులు ప్రతినిత్యం అందుబాటులో ఉన్న గ్రంథాలయ సేవలను వినియోగించుకొని,విజ్ఞానవంతులు కావాలని పలువురు వక్తలు కోరారు. భీమడోలు గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్,గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ టి.వెంకట ఉమామహేశ్వరరావు,ఇతర సభ్యులు,సామాజిక కార్యకర్త మండే సుధాకర్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిసాయి. వారోత్సవాల సందర్భంగా విద్యార్థుల కు 50 అంశాల్లో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన 150 మందికి బహుమతి ప్రధానం కార్యక్రమాలను శుక్రవారం సంతపేటలో నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి హాజరయ్యారు. నిర్వాహకులు దాతలను, ప్రముఖులతో పాటు సుమారు 40 సంవత్సరాల క్రితం ప్రారంభమైన శాఖా గ్రంథాలయంలో సీనియర్ చందాదారునిగా కొనసాగుతున్న సిటిజన్ ను,గ్రంథాలయానికి నిత్య పాఠకులు,గా కొనసాగుతున్న వ్యక్తిని సన్మానించారు. ఇదే నేపథ్యంలో పాఠశాల విద్యార్థులు లాస్య ,కీర్తన ప్రదర్శించిన స్వాగత నృత్యం, దీపిక ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్వచ్ఛంద సంస్థ మానవత జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి గంగాధర రావు తమ సంస్థ ద్వారా పోటీ పరీక్షలకు, సివిల్స్ పరీక్షలలో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతిభ గల విద్యార్థులను ఆదుకునేందుకు లక్షలాది రూపాయల మూలధనంతో విద్యా నిధి ఏర్పాటుచేశామని,దానిని వినియోగించు కోవాలని కోరారు. భీమడోలు గ్రంథాలయ అభివృద్ధికి సంస్ద తరపున రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.తెలుగు భాషా విద్వాంసులు, రచయిత, కవి జటా వల్లభుల సాయిరాం విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్,పలువురు అధికారులు ,ప్రముఖులు ,లీడర్స్ ఫోరం అధ్యక్షులు ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## మక్కా మృతులకు మసీదులో నివాళి



**కామవరపుకోట,మేజర్‌న్యూస్:** కొద్ది రోజుల క్రితం సౌదీ అరేబియాలో ఉమ్రా యాత్రికులు పవిత్ర నమాజ్ పూర్తి చేసుకొని మక్కా నుంచి మదీనాకు వెళ్తున్న సమయంలో ఆయిల్ ట్యాంక్ ఢీ కొట్టి 45 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే శుక్రవారం స్థానిక కొత్తూరు జామియా మస్జీద్‌లో శుక్రవారం నమాజ్ అనంతరం ప్రత్యేక ప్రార్ధన ద్వారా మృతుల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ఆ అల్లాహ్ తాలాకు దువా చేశారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ అధ్యక్షులు లాల్ జాన్ బాషా, కార్యదర్శి ఇబ్రహీం, సభ్యులు వజీర్ ఖాన్, బాబ్జాన్, యూసఫ్ ఆలీ, నూర్, బాషా, ఆషిక్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల పరిశుభ్రతపై గ్రీన్ అంబాసిడర్లు ,స్వీపర్లకు శిక్షణ



**కామవరపుకోట,మేజర్‌న్యూస్:** గ్రామ పంచాయతీల పరిశుభ్రత అంశంపై డీపీఆర్సీ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు మండలంలోని 15 పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీలో పనిచేయుచున్న గ్రీన్ అంబాసిడర్లు,గ్రీన్ గార్డులు,స్వీపర్లతో ఉప్పలపాడు గ్రామ పంచాయతీలో గల వీధులను శుభ్రపరిచినారు.ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో బి.శ్రీనివాసులు ,డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.సరళకుమారి పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించిన టీచర్ చంద్రశేఖర్



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న బడుగు చంద్రశేఖర్ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి యోగ పోటీలకు అర్హత సాధించారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి యోగ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బడుగు చంద్రశేఖర్ యోగాసన పోటీలలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రానున్న జనవరి మాసం లో గోవాలో నిర్వహించబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయిన బడుగు చంద్రశేఖర్ను పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రముఖులు అభినందించారు.

## కొత్త నవరసపురాన్ని ఆదర్శంగా తీసుకోవాలి : ఎంపీడీవో



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** గ్రామ కార్యదర్సులు కొత్త నవరసపురం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని పరిశుభ్రతలో అన్ని గ్రామాలను గ్రీన్ విలేజ్లుగా తయారు చేయాలని ఎంపీడీవో వీకే వీరభద్రరావు అన్నారు.శుక్రవారం మండలంలోని కొత్త నవరాసపురం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకి ఇరువైపులా, మంచినీటి చెరువుల చుట్టూ, జనావాసాల మధ్య చెత్త పేరుకు పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ గ్రామంలో నిర్వహించినట్లు అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ విలేజ్‌ల రూపకల్పనకు మార్గదర్శకాలను విడుదల చేశాయని ఎంపీడీవో అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పరిశుభ్రత పాటించాలని నరసాపురం ఎంపీడీవో వి కే వీరభద్ర రావు అన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది, ఇతర యంత్రాంగం ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామాన్ని పరిశుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగేంద్ర కుమార్, గ్రామ కార్యదర్శులు మండేలా కేశవ,మండేల శ్రీనివాస్,పుల్లాజీ, పెదపాటి శేఖర్ బాబు, శివ కళ్యాణి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి ఘనత తీసుకొస్తున్న లక్కవరం విద్యార్థులు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'ఉత్తమ విద్యుత్ సామర్థ్యం' అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో మండలంలోని లక్కవరం జెట్పీటీసీ హై స్కూల్ విద్యార్థిని కాసరపు జాహ్నవి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు.ఈ బాలిక దిల్లీలో జరుగుతున్న జాతీయ స్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎంపికైందని డిఇఓ వెంకట లక్ష్మమ్మ, జిల్లా సైన్స్ అధికారి సోమయాజులు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతను తీర్చిదిద్దిన హై స్కూల్ డ్రాయింగ్ టీచర్ మనోహర్‌ను స్థానిక ఎంఈఓలు బి.రాముడు, జి.రాములు, స్కూల్ హెచ్‌ఎం దుర్గా రావు,ఎస్ఎంసీ చైర్మన్ దుర్గారెడ్డి, ఉపాధ్యాయ బృందం శుక్రవారం అభినందించారు.జాహ్నవికి ఎన్టిపిసి సింహాద్రి యూనిట్ ఉన్నతాధికారులు రూ.30వేలు నగదు బహుమతి అందజేశారు. ఇంతటి ఘనతను సాధించిన విద్యార్థిని జాహ్నవిని లక్కవరం గ్రామస్తులు కూడా అభినందించారు.

## శ్రీ చైతన్య విద్యార్థులకు నాసా కిట్లు ప్రదానం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెం శ్రీ చైతన్య పాఠశాలలో నాసా వారు 2025 26 సంవత్సరంనకు సంబంధించి స్పేస్ నిర్వహించిన ప్రాజెక్ట్ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు స్పేస్ అగ్రికల్చర్ కు సంబంధించి కైలాష్ 2.0 గరుడ అనే ప్రాజెక్టులు తయారు చేసి పంపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులను అభినందించారు సి ఎస్.టి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ బాబు,వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు,లెక్చలర్ మధు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరి విద్యార్థులను అభినందించి,కిట్లు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఏవో కే శ్రీనివాసరావు,డిసి మహమ్మద్ అలీ,శివ సుబ్రహ్మణ్యం, నాసా ఇన్చార్జి ఎస్.రత్నంరాజు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## లక్కవరంలో కవి సమ్మేళనం





**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** మండలంలోని లక్కవరంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవల ముగింపు కార్యక్రమం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ పఠాన్ అన్వర్ భాషా అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జి.కొత్తపల్లి ప్రధానోపాధ్యాయులు కె.లీలా కుమార్ ప్రసంగిస్తూ విద్యార్థులు చదువులో కూడా పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు.అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని,విజేతలుగా నిలిచిన సబ్బి కనకారావు ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు అమరావతిలోని రాష్ట్ర ప్లానింగ్ డిపార్టుమెంటు డైరెక్టర్ లక్కవరం గ్రామస్తురాలైన పారేపల్లి విజయలక్ష్మికి బహుమతులను సమర్పించారు.ఈకార్యక్రమంలో పలువురు ప్రముఖులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి యాజ్ తెలిపారు.

# నాకు,నా కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించండి

**- రాజీకి రాకపోతే నీ భర్తకు పట్టిన గతే నీకు, పిల్లలకు పడుతుందని బెదిరింపు**

**- ప్రతిక్షణం భయం గుప్పెట్లో బతుకుతున్నామన్న భవాని కుటుంబం**



**కైకలూరు,మేజర్‌న్యూస్ :** మా కుటుంబానికి ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి అంటూ మహిళకన్నీరు పెట్టి వేడుకుంటుంది. కైకలూరు మండలం నరసాయిపాలెం గ్రామంలో ఇటీవల ఒకచిన్న ఘర్షణతో మొదలై మాడపాటి రమేష్ అనే వ్యక్తి చేతిలో అదే గ్రామానికి చెందిన జయప్రకాష్ అనే వ్యక్తి తలపై బలంగా దాడి చేయటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించిన అనంతరం జయప్రకాష్ మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు భార్య బోయిన భవాని శుక్రవారం ఆమె నివాసం వద్ద పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త మృతికి కారణమైన మాడపాటి రమేష్ వర్గీయులు రెండు రోజుల క్రితం తన ఇంటిపై దాడి చేసి మా కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. ఈ కేసు విషయమై మీకు కొంత నష్టపరిహారం చెల్లిస్తాం. అవి తీసుకుని రాజీకి రావాలని కోరారు. లేని పక్షంలోనీ భర్తను చంపిన విధంగానే నిన్ను కూడా చంపేస్తా మని బెదిరించారని ఆమె వాపోయారు. నాకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఇంటిదగ్గర ఎవరు లేని సమయంలో నాపై దాడి చేసి చంపేస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాకు ప్రాణహాని ఉంది. తనను రక్షించాలని పోలీసు వారిని కోరుతున్నట్లు తెలిపారు. కొండంత భారంతో దుఃఖాన్ని దిగమింగుతూ ఇద్దరు చిన్నపిల్లలతో ప్రతిక్షణం భయపడుతూ జీవనం సాగిస్తున్న భవానికి పోలీసులు రక్షణ కల్పించి సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో భాగస్వాములు కావాలి

**- న్యాయవాదులకు న్యాయమూర్తి వాసంతి సూచన**



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** ఈ సంవత్సరంలో చివరి 4వ జాతీయ లోక్ అదాలత్ అనగా డిసెంబర్ 13వ తారీకున జరిగనున్న జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులకు సమన్యాయం అందించే దిశగా న్యాయవాదులు సహకరించాలని నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎ.వాసంతి అన్నారు. శుక్రవారంబార్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. క్రిమినల్ కేసులతో బాటు ప్రామిస్సరీ నోట్, ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లు,చెక్ బౌన్స్ ,భూ తగాదాలు, కుటుంబ తగాదాలు వంటి కేసుల్లో ఇరుపార్టీలను సమన్వయ పరిచి లోక్ అదాలత్ ముఖోద్దేశాన్ని వివరించి సాధ్యమైనంత వరకు కేసులు పరిష్కారం అయ్యేలా ప్రయత్నించాలని లోక్ అదాలత్‌లో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతిరోజూ కోర్టులో జరుగుతున్న మధ్యవర్తిత్వంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీ వి.సూర్య ప్రకాశరావు, ట్రెజరర్ పి.శ్రీనివాస్, పాలకొల్లు బార్ అసోసియేషన్ సెక్రెటరీ చక్రవర్తి, సీనియర్ , జూనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆక్వా వ్యర్థాలతో హరించి పోతున్న మత్స్య సంపద



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సముద్రంలో వ్యర్థాలు కలవకుండా మత్స్య సంపదను కాపాడాలని ఏపీ మత్స్యకారుల,మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్రావు అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని పీఎంలంక గ్రామంలో ప్రపంచమత్స్య దినోత్సవం పురస్కరించుకుని ఏపీ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన మత్స్యకారుల సమస్యలు మాత్రం నేటికి పరిష్కారం లేదన్నారు. ఆక్వా పరిశ్రమల వ్యర్థాలతో సంపద హరించిపోతుందన్నారు. దీని వల్ల మత్స్యకారుల జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు.

ప్రభుత్వం స్పందించి మత్స్య సంపదను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తిరుమాని వెంకటేశ్వరు, రామకృష్ణ, ఏడుకొండలు, శ్రీను, వెంకటేశ్వ రావు, ఏసుబాబు. సత్యనారాయణ, ముత్యాలరాజు, సంకరపు వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.

# ప్రతి మంగళవారం జనవాణి : ఎమ్మెల్యే బాలరాజు



జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:పోలవరం నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి మంగళవారం నియోజకవర్గంలో "జనవాణి కార్యక్రమం"ను నిర్వహించనున్నట్లు పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూజనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రతి మంగళవారం ఒక మండలంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆసమావేశ వివరాలన్నీ ఆ మండలంలో ఉన్న అన్ని పంచాయతీలలో ప్రజలకు తెలియజేసి వారిని నుంచి వినతుల స్వీకరిస్తామని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు యువ నాయకులు నారా లోకేష్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమంగా ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తున్నారని తెలిపారు. ప్రతి మండలంలోనూ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈగ్రీవెన్స్ ద్వారాప్రజలసమస్యలు తెలుసుకొని పరిష్కరిం చేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రజలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్న తెలియజేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు.

## ప్రతి నెల మొదట, మూడో శుక్రవారం అర్జీలు స్వీకరణ

**- పిటీషన్లు స్వీకరించిన ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం,మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం భీమవరం నియోజక వర్గ ప్రజల నుంచి అర్జీలను (పీజీఆర్ఎస్) స్వీకరించారు. స్వయంగా అర్జీదారుల సమస్యలను తెలుసుకుని వారితో మాట్లాడారు. వీరవాసరం మండలం బొబ్బనపల్లి గ్రామంలో నాచు పట్టిన నీళ్లు వస్తున్నాయని, సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. పలువురు వారి సమస్యలను తెలియజేసి అర్జీలను అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశామని అన్నారు. నెలలోని మొదటి శుక్రవారం, మూడో శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అర్జీలను స్వీకరిస్తామని, వారం రోజుల్లోనే సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు.

# బొంతు వారి వన సమారాధన

**- పిల్లలు పెద్దలతో పాల్గొన్న కుటుంబ సభ్యులు**



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** కుటుంబ సభ్యుల మధ్య ఐకమత్యం ఆప్యాయత అనురాగాలు పెంపొందించుకునేందుకు వన సమారాధనలు ఎంతగానో దోహధ పడతాయని పెద్దలు బొంతు వెంకటేశ్వరరావు బొంతు బాబురావు,బొంతు సుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం బొంతు సుబ్బయ్య వ్యవసాయ క్షేత్రంలో బొంతు వారి కుటుంబ సభ్యులు వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి ఆటపాటలతో ఆనందంగా గడిపి సహబంతి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏడాదికి ఒకసారి వన సమారాధనతో కుటుంబ సభ్యులంతా ఒకచోటకు చేరడం ఆనందమని అన్నారు. ఇలా నిత్యం ఏవో పనులతో హడావిడిగా ఉండే జీవితాలలో ఏడాదికోసారి ఒక చోట కూర్చుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందంగా గడపడం మరిచిపోలేనిది అని పేర్కొంటున్నారు. బొంతు వారి కుటుంబ సభ్యులంతా ఒకచోటకు చేరి ఆనందంగా గడపటం తమ కుటుంబ సభ్యులలో మరిచిపోని అనుభూతి అని అందరూ ఇటువంటి విధానాన్ని పాటిస్తే కుటుంబ సభ్యుల మధ్య బాంధవ్యాలు పెరిగి బాగుంటుందని సూచిస్తున్నారు. వనసమరాధనల వలన ప్రతి కుటుంబంలో ఆరోగ్యం ఆనందం ఐశ్వర్యం వృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సతిమణికి రూ.1లక్ష చెక్కు అందజేత



**ఏలూరు,మేజర్ న్యూస్ :** సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పనిచేస్తుందని ఏఎస్పి నక్కా సూర్యచంద్రరావు అన్నారు. గత కొద్దిరోజుల క్రితం మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్రరావు సతీమణికి అడిషనల్ కార్పస్ పోలీస్ ఫండ్ నుండి రూ. 1లక్ష రూపాయల చెక్కును ఏఎస్పి జిల్లా ఎస్పీ ఆఫీసులో శుక్రవారం మధ్యాహ్నం అందించారు. ఆయనకు పోలీసు శాఖ తరపున రావాల్సిన సొమ్మును త్వరితగతన వారి కుటుంబ సభ్యులకుఅందించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పేదల ఆరోగ్య సంరక్షణకు నిలువెత్తు ఆదరణ సీఎం సహాయ నిధి

**– చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** సీఎం సహాయనిది పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్ద తోడ్పాటుగా నిలుస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటోందని తెలిపారు. శుక్రవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన10మంది లబ్ధిదారుల కు మొత్తం రూ.7,33,000 లక్షలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

చెక్కులు అందుకున్న కుటుంబాలు ఎమ్మెల్యే బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు గారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం అంటే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఆర్థిక ఇబ్బందులు వైద్యం పొందడంలో అడ్డంకిగా మారకూడదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం అని ఈ నిధి ద్వారా మరెంతో మంది బాధితులు మెరుగుపడాలని ఆశిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమినాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని పర్యావరణహితంగా తయారు చేయాలి



**భీమడోలు,మేజర్ న్యూస్ :** గ్రామాన్ని పర్యావరణహితంగా, తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి కోరారు. పంచాయితీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ 2.0 కార్యక్రమంలో భాగంగా థీమ్ 5గా గుర్తించిన గ్రీన్ అండ్ గ్రీన్ యాక్షన్ ప్లాన్ 2025-26వ ఆర్థిక సంవత్సరం కార్యక్రమం అమలుకు పోలసానిపల్లి గ్రామాన్ని మోడల్ ఎంపిక చేశారు. గత రెండు రోజులుగా కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఉప సర్పంచులకు ఒక రోజు,స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామ ఆర్గనైజేషన్ సహాయకులకు మరొక రోజు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన శుక్రవారం కార్యక్రమం అమల కోసం పోలసానిపల్లి గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేశారు. గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్, క్లాప్ మిత్ర, ఇతరులకు శుక్రవారం ప్రత్యక్ష తరహాలో శిక్షణ ఇచ్చారు. పారిశుధ్య పరిరక్షణలో భాగంగా ఏడు అంశాల అమలు విషయమై శిక్షణ కొనసాగింది. కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వివిధ గ్రామపంచాయతీ కార్యదర్శులతో సహా ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమ అమలు తీరును సామర్లకోట, గ్రామపంచాయతీ శిక్షణ కేంద్రంకు చెందిన అధికారి రామకృష్ణ వచ్చారు. కార్యక్రమాన్ని పరిశీలించారు. దీనికి కోర్సు డైరెక్టర్ గా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాల్గొనగా, సహాయ డైరెక్టర్ గా డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుబ్బారావు వ్యవహరించారు. శిక్షణ కార్యక్రమాలపై డివిజనల్ స్థాయి రిసోర్స్ పర్సన్ సూర్య, మండల స్థాయి రిసోర్స్ పర్సనల్ గా గ్రామపంచాయతీ కార్యదర్శులు ముత్తయ్య, రత్నాకర రావు, వెంకట్రావు వ్యవహరించారు. వివిధ అంశాల గురించి వివరించారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. స్థానిక గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొప్పాక శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఈఓ జి.రాములు, ఎంపీడీవో కేఎస్ఆర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. వారోత్సవాలు సందర్భంగా జరిగిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలను గుళ్ళపూడి నాగచందర్రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కామరాజు అందించారు. అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ఇనుముల వెంకట పాపారావు గ్రంథాలయానికి బాలకృష్ణ ఫాన్స్ తరఫున 6 కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం రాజీలేని పోరాటం

**– గుజరాతీల కోసమే ఆపరేషన్ కగార్**
**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) రాజీలేని పోరాటం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం సిపిఐ జిల్లా సమితి కార్యవర్గం, కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఉన్న విలువైన ఖనిజ సంపదను ఇద్దరు గుజరాతీయులు విక్రయిస్తుంటే ఇద్దరు గుజరాత్ కార్పొరేట్ వ్యక్తులు కారు చౌకగా కొనుగోలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడటం కోసమే ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను ఫేక్ ఎన్కౌంటర్ చేస్తూ మారణ హోమం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తతాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనని వాగ్దానం చేసిరాష్ట్ర ప్రజలపై రూ.12,470 కోట్ల భారాలు వేశారని విమర్శించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలగొట్టడానికి పిలుపు ఇచ్చి, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాతఆస్మార్ట్ మీటర్ల బిగింపును స్వాగతిస్తున్నార న్నారు. డిసెంబర్ 26వ తేదీన సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సభ ఖమ్మం జిల్లాలో జరుగుతుందని జిల్లా నుండి 2,500 మందికి పైగా కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ నాటితరం నుండి నేటి తరం వరకు నాయకులు చేసిన త్యాగాలు పోరాటాలు, సాధించిన విజయాలు ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. తొలుత సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య,ఉప్పులూరి హేమ శంకర్, బాడిస రాము,జేవి రమణ రాజు,రెడ్డి శ్రీనివాస్ డాంగే,కొన్నె లక్ష్మయ్య తొర్లపాటి బాబు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు,జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యం ఆరబెడుతున్న అన్నదాతలు

**– వాతావరణంలో మార్పులు – రైతు గుండెల్లో అలజడి**



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను, వర్షాలకు తరచూ నష్టపోతున్నామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మొన్న మొదా తుఫాన్‌కు, రైతుల పంట పొలాలు నష్టపోగా చేతికి వచ్చిన పంట కోత కోసి, ధాన్యం ఆరబోసి రైస్ మిల్కు తరలించాలని రైతులు ఒకపక్క పనుల్లో నిమగ్నం కాగా వాతావరణ శాఖ అధికారులు అధిక వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు నేపథ్యంలో రైతులు గుండెల్లో అలజడి ప్రారంభమైంది. ఇప్పటికే తుఫాను కారణంగా ధాన్యం నల్లమచ్చ వచ్చి పంట దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. మూల్కే నక్క పైన తాటికాయ పడినట్టు చందంగా తుఫాన్కారణంగా ధాన్యం ఓబ్బిడి చేసేందుకు రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. వరుణ దేవుడు కనికరిస్తే పంటకు పెట్టిన పెట్టుబడి వస్తుందని లేనిపక్షంలో అప్పులు బాధలు ఎక్కువ అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## పాత్రికేయులు కొట్టి రామంకు పరకాల ట్రస్ట్‌చే రూ.10వేలు సాయం



**పోడూరు,మేజర్ న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం వేడంగి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు కొట్టి రామం ఇటీవల ఇంటి వద్ద ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఈవిషయం తెలుసుకున్న పోడూరు మండలం కవిటంలోని పరకాల ట్రస్ట్ చైర్మన్ పరకాల సూర్య మోహనరావు కొట్టి రామంకు శుక్రవారం అందజేశారు. రామం పూర్తిగా కోలు కోలేనందున నేరుగా అతని బ్యాంక్ ఖాతాకు జమ చేసినట్లు ఆయన తెలిపారు. పరకాల ట్రస్ట్ అందిస్తున్న. వైద్య సేవలు, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పాఠశాల అభివృదికి క్రీడా పరికరాలు ఇస్తున్న పరకాల ట్రస్ట్ తనకు ఆర్థిక సాయం అందించడం పట్ల కొట్టి రామం కుటుంబ సభ్యులు పరకాల ట్రస్ట్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## మారేడుబాకలో పరిసరాల పరిశుభ్రత



**కుక్కునూరు,మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మారేడుబాక గ్రామంలో జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం ఎల్ఎస్‌డిసి థీమ్స్‌లో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం స్థానిక సర్పంచ్ మడకం తిరుపతమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో నాగరాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రతినెల మూడవ శనివారం నిర్వహించటం జరుగుతుందని అందులో భాగంగానే ఏదైనా ఒక గ్రామంలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించాలనె కార్యక్రమాన్ని మండలంలోని సుమారు 18 మంది గ్రీన్ అంబాసిడర్లతో మారేడుబాకలో పరిసరాల పరిశుభ్రత ఇంటింటి తడి పొడి చెత్త సేకరణ ఎస్ డబ్ల్యూ ఎం షెడ్ నిర్వహణ మొదలైన కార్యక్రమాలను నిర్వహించామని అలాగే గ్రామంలోని ప్రజలందరూ తడి పొడి చెత్తను వేరువేరుగా గ్రీన్ అంబాసిడర్ కు ప్రతిరోజు అందించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నరసింహారావు మండల రిసోర్స్ కోఆర్డినేటర్ రమేష్ పంచాయతీ కార్యదర్శులు నాగదుర్గ ధర్మ గోవిందు గణేష్ వరప్రసాద్ అజయ్ కిరణ్ సాయిబాబు వెంకటరమణ సచివాలయ సిబ్బంది గ్రామస్తులు ముప్పాల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులు అన్ని పరిష్కరించేందుకు కృషి

– ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు వెల్లడి



**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని జీలుగుమిల్లిలో 'గ్రీవెన్స్' కార్యక్రమం టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించారు.ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి సమస్యలను వివరించారు వారి చెప్పిన సమస్యలను తెలుసుకున్న బొరగం శ్రీనివాస్ సమస్యలను వెంటనే అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించారు. అలాగే చెరువు పై పనులు మరమ్మతులు చేపట్టాలి,సిసి రోడ్డులు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గ్రావెల్‌రోడ్డు, పెన్షన్ సమస్యలు గురుంచి వివరించారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితుల సమస్యలు సమస్యలు గురించి వివరించారు.ఈ సమస్యలను ఉన్న పథకాలతో మాట్లాడి త్వరలో పూర్తిగా సమస్యలు పరిష్కరిస్తామని బొరగం శ్రీనివాసులుహామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలోనియోజకవర్గం పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, మండలంపార్టీఅధ్యక్షులు సుంకవల్లి సాయి,మాజీ మండలం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి సోమసుందరం, పొట్ట రామారావు, ఎంపీటీసీ నాలి శ్రీను,చాప రవి,లక్ష్మినారాయణ,గద్దె సుబ్రహ్మణ్యం, సర్పంచ్ వనమా రాంబాబు గరపాటిశ్రీను,ఉండవల్లికిరణ్,నందికోల వీర్రాజుబోలగాని అఖిల్, గంధం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వాసవిలో స్వచ్ఛభారత్ అవగాహన సదస్సు





**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** శ్రీ వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీ నందు స్వచ్ఛ భారత అవగాహన సదస్సు జరిగినది. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ ఎన్ వి రమణరావు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సు కు స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్ రోహిత్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సుల్తానా బేగం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎన్ రాజు, కళాశాల ప్రిన్సిపల్ ఎం రామకృష్ణ సానిటరీ ఇన్స్పెక్టర్ లు సోమేశ్వర రావు, శ్రీనివాస్ రావు సానిటరీ సెక్రటరీ వివేక్ తదితరులు పాల్గొన్నారు. రోహిత్ మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్త వేరు చేయటం లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం మరింత అవసరమని ఈ విద్యార్థుల ద్వారా ఈ కార్యక్రమంను ముందుకు తీసుకెళ్లాలని కృషి చేస్తున్నామని తెలిపారు. కళాశాల చైర్మన్ రమణరావు మాట్లాడుతూ వ్యవస్థలు, ప్రజల భాగస్వామ్యంతో ఇలాంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయని మా కళాశాల విద్యార్థులు ఈ దిశగా కృషి చేస్తారని హామీ ఇచ్చారు.

### జుత్తిగలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పెనుమంట్ర,మేజర్ న్యూస్ : పెనుమంట్ర మండలంలోని జుత్తిగ రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షులు వీరవల్లి రాంబాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని అన్నారు.అన్నదాత సుఖీభవ రెండో విడత 7వేలు బ్యాంకు ఖాతాలో జమ చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వీరవల్లి రాంబాబు సర్పంచ్ తమనంపూడి వీరెడ్డి, గ్రామ టిడిపి నాయకులు గొలుగూరి శ్రీనివాస్ రెడ్డి బిజెపి నాయకులు బ్రహ్మానంద రెడ్డి జనసేన నాయకులు సానబోయిన ప్రకాష్ రైతులు,కూటమి నాయకులు వీరవల్లి సత్యనారా యణ అమ్మి రెడ్డి, సాయిబాబా రెడ్డి,ఎర్రబ్బులు,పీవీ రెడ్డి సోంభాస్కర్ రెడ్డి ,సాన బోయిన ప్రసాద్,గూడూరి లక్ష్మణ్,గ్రామ రైతులు రెవిన్యూ డిపార్ట్మెంట్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే వినతులు స్వీకరణ

– ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్





**నరసాపురం,మేజర్ న్యూస్:** ప్రతివారం ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యలపై వినతిపత్రాల స్వీకరించినట్లే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూడాఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్తెలిపారు.శుక్రవారం పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజల ద్వారా వినతి పత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు ఆ పార్టీ ఇంచార్జ్ పొత్తూరు రామరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. సభలో షరీఫ్ మాట్లాడుతూ వచ్చిన వెనతులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని,ఆ సమస్య పరిష్కారం అయ్యేవరకు స్థానిక నాయకులు అధికారులతో మాట్లాడుతున్నారన్నారు. తక్షణం పరిష్కారం అయ్యే సమస్యలకు సంబంధించి వెంటనే అధికారులతో చేస్తున్నట్లు తెలిపారు.ఈసందర్భంగా వచ్చిన వినతిపత్రాలను రామరాజుతో పాటు తెలుగు దేశం పార్టీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలియతి రాజా రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ తదితరులు స్వీకరించారు.

## ఆటో యూనియన్ల గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి : సిఐటియు




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు టౌన్, రూరల్ పరిధిలోని ఆటో యూనియన్ల గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఆఫీసులో జరిగిన ఆటో యూనియన్ జిల్లా మహాసభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఏలూరు నగరంలో ఆటో కార్మికుల సమస్యలపై అనేక సమస్యల పోరాటాలు నిర్వహించిన సిఐటియుకు టౌన్ అండ్ రూరల్ పరిధిలోని ఆటో యూనియన్‌లో మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఆటో స్టాండ్ పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, ఈ చలానాలు రద్దు చేయాలని, రాపిడ్ వంటి సంస్థలను నిలిపివేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నగరంలో అనేక ఉద్యమాలు నిర్వహించారని ఆయన తెలిపారు.

ఆటో డ్రైవర్లకు నిత్యం అందుబాటులో ఉంటూ సిఐటియు ఆటో యూనియన్ నాయకత్వం ఏలూరు నగరం,పరిసర ప్రాంత గ్రామాల ఆటో యూనియన్లకు డ్రైవర్ల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని అన్నారు. మహాసభ రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. జీవో నెంబర్ 21 రద్దు చేయాలని బి.ఎన్.ఎస్ 106 (1)(2) చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహాసభకు నగర్ ప్రధాన కార్యదర్శి మంచెల్ల ఇస్సాకు సౌహార్థ సందేశాన్ని ఇచ్చారు. చక్రాల అమర్ కుమార్ జిల్లా అధ్యక్షులుగా, జె గోపి ప్రధాన కార్యదర్శిగా, నత్త వెంకటేశ్వరరావు కోశాధికారిగా, బిచంద్రశేఖర్, ఏరాజు,కేశ్రీను తదితరులతో ఈమహాసభలో నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మత్స్య కళాశాలలో ముగిసిన ఆక్వా రైతుల సదస్సు



**నర్సాపురంరూరల్,మేజర్ న్యూస్ :** మండలంలోని లక్ష్మణేశ్వరంలో గల మత్స్యకళాశాలలో ఆక్వా రైతులకు మూడు రోజులపాటు నిర్వహించిన సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ మూడు రోజుల తరగతుల్లో రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల నుండి వచ్చిన నిపుణులు రొయ్యల సాగు – వ్యాధుల యాజమాన్యం" తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. రొయ్యలలో కనిపించే ప్రధాన వ్యాధులు, వాటి శాస్త్రీయ నిర్ధారణ, నమూనాలు సేకరించే విధానం, ప్రయోగశాల పరీక్షల ప్రాముఖ్యత, నివారణా చర్యలు వంటి అంశాలను ఏ శ్రీనివాస్ డాక్టర్ ఏ చంద్రశేఖర్ రావు, రైతులకు వివరించారు.నీటి నాణ్యత, బయో సెక్యూరిటీ చర్యలు,రొయ్యల వృద్ధి పర్యవేక్షణ వంటి కీలక అంశాలను చిత్రాల సహాయంతో వివరించారు.శిక్షణలో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ప్రొఫెసర్ సుగుణ,శ్రీనివాస్,డాక్టర్ ఏ చంద్రశేఖర్లు మాట్లాడారు. ఏఎఫ్‌టియు మత్స్యకళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి : మరొకరికి తీవ్ర గాయాలు



**మండవల్లి / కైకలూరు, మేజర్ న్యూస్,** ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండవల్లి మండలంలో చోటుచేసుకుంది .పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం ఆలపాడుకు చెందిన పడమట సత్యనారాయణ (25), చావలపాడు కు చెందిన మాజీ కైకలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ తలారి వెంకటస్వామి ద్విచక్ర వాహనాలపై మండవల్లి వైపు వస్తుండగా మార్గమధ్యలో భైరవ పట్టణం రైల్వే గేట్ సమీపంలో 2 ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొని ఇద్దరు కింద పడ్డారు. ఈ ఘటనలో పడమట సత్యనారాయణ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.తలారి వెంకటస్వామి తలకు బలమైన గాయాలు అవడంతో ఏలూరు ప్రైవేట్ వైద్య శాలకు చికిత్స నిమిత్తం స్థానికులు తరలించారు. ఎస్ఐ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సందర్శించి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## శ్రీ నూకాలమ్మ దేవస్థానంలో విశేష పూజలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** పట్టణంలోని శ్రీ నూకలమ్మ అమ్మవారు శుక్రవారం సందర్భంగా విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.పలు పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కాళ్ళకూరి శంకర మహేష్ శర్మ,విజయ పవన్ శర్మలు నిర్వహించారు.ఆలయ శాశ్వత చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు),ఆలయ కమిటీ చైర్మన్ రొంగల నాగేశ్వరరావు,కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. నిమ్ము దుర్గా వెంకటరమణ కుమార్, శ్రీ లక్ష్మీ దంపతులు 5 తులాల వెండిని అమ్మవారి వెండి చీర తయారీకి సమర్పించారు.

పిన్నమనేని చంద్రశేఖర్,వెంకటలక్ష్మి దంపతులు యాదగిరి (కర్ణాటక) రూ.5,116లు ఆలయ అభివృద్ధికి సహకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,పట్టణ ప్రముఖులు, మహిళా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారని చిటికెన రాంబాబు తెలిపారు.

# దెందులూరు నియోజకవర్గంలో వెల్లువెత్తిన స్వచ్ఛత స్ఫూర్తి






**- దుగ్గిరాల, వట్లూరు, దెందులూరు, చాటపర్రు గ్రామాల్లో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్**

**- రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, ఎమ్మెల్యే చింతమనేని,జిల్లా కలెక్టర్**

**పెదపాడు,మేజర్ న్యూస్ :** మండలంలోని వట్లూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రూ.30 లక్షల రూపాయల స్వచ భారత్ నిధులతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (40 బాలికల టాయిలెట్స్)ను ప్రారంభం - దెందులూరులో వేస్ట్ మేనేజ్మెంట్ కోసం అవసరమైన షెడ్స్ నిర్మాణానికి చర్యలు - కొబ్బరి వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణకు మరో షెడ్ ఏర్పాటుకు చర్యలు -గత టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చెత్త సేకరణలో భాగస్వామ్యం అయ్యి వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఏలూరు మార్కెట్ యార్డ్‌లో నిరుపయోగంగా మూలన పడేసి ఉన్న 80 కెనటిక్ వాహనాలను స్వచ్ఛంద కార్పొరేషన్ కామారెడ్డి పట్టాభితో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గ్రామాల్లో చెత్త సేకరణ తరలింపునకు యంత్రాలను మరమ్మత్తులు చేసి తిరిగి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ, జిల్లా పంచాయతీ అధికారి అనురాధ సహా పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది,పాల్గొని క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దెందులూరు నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల వారీగా పెదవేగి మండలానికి చెంది దుగ్గిరాల గ్రామంలో, పెదపాడు మండలానికి చెంది వట్లూరు గ్రామంలో,దెందులూరు మండలానికి చెందిన దెందులూరు గ్రామంలో, ఏలూరు రూరల్ మండలానికి సంబంధించి చాటపర్రు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే జరుగుతున్న క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం జరిగింది.

### ఆనారోగ్య బాధితురాలికి రూ.41 వేల సిఎం సహాయనిధి అందజేత



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక 35వ డివిజన్ కు చెందిన షేక్ అజీ మున్నిష అనారోగ్య సమస్యతో చికిత్స పొంది వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం కొరకు శాసనసభ్యులు బడేటి రాధా కృష్ణయ్య (చంటి)ని సంప్రదించారు. ఆయన సీఎం సహాయ నిధినుండి రూ.41,365 మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజ నేయులు,35వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ అలజంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సిద్ధాంతం శివస్వాముల నగర సంకీర్తన



**పెనుగొండ, మేజర్ న్యూస్:** సిద్ధాంతం గ్రామంలో గురు స్వామి నక్క సూర్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో 48 రోజులు శివమాలలు ధరించి దీక్ష పూర్తి చేసుకున్న శివభక్తులు శుక్రవారం అఘోరాల వేషధారణలతో హరహర మహాదేవ శంభో శంకర అంటూ ఘనంగా నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధులంతా శివనామస్మరణతో మార్మోగిపోయాయి. భక్తులు భజనలు, డప్పుల నాదంతో ఆలయాన్ని తలపించేలా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. దీక్ష పూర్తి చేసుకున్న శివస్వాములు శనివారం శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి వారి దర్శనార్థం బయలుదేరనున్నట్లు గురుస్వామి నక్క సూర్యనారాయణ స్వామి తెలిపారు. గ్రామ పెద్దలు, స్థానిక భక్తులు వారికి ఆశీర్వచనాలు తెలియజేశారు.

### ఆదివాసి వైద్య, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**- శాసనసభ్యులను కోరిన యూనియన్ సభ్యులు**



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించాలని శాసన సభ్యులను యూనియన్ సభ్యులు కలిసి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు.జిల్లా వారి ఆధ్వర్యంలో వైద్య శాఖలో ఉన్నటువంటి పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. తామిచ్చిన వినతిపత్రం పై శాసనసభ్యులు చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బాలరాజు కు యూనియన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ సున్నం శ్రీరాముల దొర వైస్ ప్రెసిడెంట్ తెల్లం పోసమ్మ జనరల్ సెక్రెటరీ వెట్టి వెంకటేశ్వరరావు జీలుగుమిల్లి మండల అధ్యక్షులు కూరం ప్రసాద్ మెంబర్ కలుమ రాజారావు పలువురు కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

### హరిత రాయబారులతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



**పెనుగొండ, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల ప్రకారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా అన్ని గ్రామాలు థీమ్-5 అయిన పరిశుభ్రమైన గ్రామము,హరిత గ్రామములుగా రూపొందడానికి గాను ప్రతి జిల్లా కేంద్రంలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారులకు డిప్యూటీ మండల అభివృద్ధి అధికారులకు , రిసోర్స్ పర్సన్ లకు ,ఎంపిక కాబడిన పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం జరిగినది.తదుపరి ప్రతి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు, పంచాయితీ సర్పంచులకు, ఉప సర్పంచులకు ,డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ శిక్షణ అనంతరం పెనుగొండ మండలం నుండి ఎంపిక చేయబడిన ములపర్రు గ్రామంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో మండలంలోని హరిత రాయబారులతో పరిశు భ్రమైన గ్రామము,పచ్చదనం కలిగిన గ్రామంగా రూపొందే విధంగా గ్రామ కూటమి నాయకులు సమక్షంలో ఒకరోజు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందిఈ కార్యక్రమంలో పెనుగొండ మండల అభివృద్ధి అధికారి టి. సూర్య నారాయణ మూర్తి,డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి ఓ.సూర్య ప్రకాష్‌రావు,గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నైట్ హాల్ట్ విధుల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం తగదు

**- ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు**

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** నైట్ స్టడీ నైట్ హాల్ట్ విధుల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం తగదని ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటిఏ జిల్లా అధ్యక్షులు సరియం నాగేశ్వరరావు అధ్యక్షతన బుట్టాయిగూడెంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు హాజరై మాట్లాడుతూ హాస్టల్ మరియు స్కూల్ విధులు వేరువేరుగా ఉంటాయని,హాస్టల్ విధులు కూడా ఉపాధ్యాయులకు కేటాయించడం సరైంది కాదన్నారు.రాత్రి స్టడీ అవర్స్ విధులు నిర్వహించి హాస్టల్లోనే బస చేయాలని ఆదేశించడం ఉపాధ్యాయులను మానసికంగా వేధించడమే అవుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు,జిల్లా గౌరవ అధ్యక్షులు సోదేం రాజు,జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా రమేష్,ఉపాధ్యక్షులు తెల్లం గంగరాజు ,పైదా సురేష్,ధర్మల బాబురావు ,తదితరులు ఉన్నారు.

### ఛాంబర్స్‌లో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**పాలకొల్లు,మేజర్ న్యూస్ :** స్థానిక బిఆర్ఆర్ , జికెఆర్ చాంబర్స్ డిగ్రీ,పీజీ కళాశాల ప్రాంగణంలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి భారతీయ గ్రంథాలయ పితామహుడు ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేశారు,ఈ సందర్భంగా డాక్టర్ డి వెంకటేశ్వరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన ప్రబోధానికి ఆధార స్తంభాలు అని విద్యార్థిని విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానంతో పాటు,మనోవికాసం కలుగుతుందని అన్నారు.ఈ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్ ,మెడల్స్ బహుకరించారు, ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ మాణిక్యాల రావు అధ్యాపకులు నరసమాంబ, శిరీష,సత్యవేణి,శైలజ, శివప్రసాద్ వర్మ, పవన్ కుమార్, భవాని శ్రీ,ప్రసన్న , ఎన్. రవికుమార్, సిరి చందన,జానకిరామయ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మక మాగ్నస్ పోటీలలో థెరిసా విద్యార్థినుల ప్రతిభ




**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరులోని సెయింట్ థెరిసా అటానమస్ కాలేజ్ ఫర్ ఉమెన్ విద్యార్థులు, ఏలూరులోని రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం నిర్వహించిన ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి మేనేజ్మెంట్ మీట్ మాగ్నస్ -2025లో ప్రథమ బహుమతులను గెలుచుకోవడం ద్వారా కళాశాల కీర్తిని తెచ్చిపెట్టారు. వర్డ్ వేవ్, మార్కెట్ మోజో ట్రెండ్ స్పార్క్ వంటి విభిన్న ఈవెంట్లలో పోటీ పడుతూ, మా విద్యార్థులు ఆదర్శప్రాయమైన నిర్వాహక నైపుణ్యాలు, సృజనాత్మకత నైపుణ్యాలు ప్రదర్శించారు.వి రుద్రాణి కె.మోహిత అత్యుత్తమ పదజాలం విశ్లేషణాత్మక సామర్థ్యంతో వర్డ్ వేవ్ టైటిల్ ను కైవసం చేసుకున్నారు. మార్కెట్ మోజో బృందం ఏ. వర్షిణి, ఎస్. కె. ఫర్హీన్, ఏ.వైష్ణవి, కె.మోహిత వారి వినూత్న మార్కెటింగ్ వ్యూహాలు కార్పొరేట్ నైపుణ్యాలతో న్యాయనిర్ణేతలను ఆకర్షించారు. ట్రెండ్ స్పార్క్లో ఎ.సృజిత రావు తన స్పష్టమైన ప్రదర్శనతో ఆకట్టుకుని, ప్రథమ స్థానాన్నిపొందింది.విజేతలను కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సిస్టర్ మెర్సీ, ఉప ప్రధానాచార్యులు డాక్టర్ సిస్టర్ సు నీలరాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సిస్టర్ సునీల, అధ్యాపకులు అభినందించారు.

# మాదకద్రవ్య రహిత జిల్లాగా ఏలూరు





**- గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల కేసులలో పట్టుబడితే కఠిన శిక్షలు**
**- యువత మాదకద్రవ్యాల జోలికి పోవద్దు : జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** యువత ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసే గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలనిజిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను రూపొందించేందుకు సమాజంలోని ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు జోలికి వెళితే భవిష్యత్తు అంధకారమవుతుందని యువతలో అవగాహన కలిగించి, యువత మాదకద్రవ్యాల జోలికి పోకుండా చూడాలన్నారు.మాదకద్రవ్యాలతో పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు కలిగివున్నా , వినియోగం,రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ఉద్యోగాలకు,పాస్పోర్ట్ ల జారీ కి అనర్హతతో పాటు శాశ్వత క్రిమినల్ రికార్డు కలిగి ఉంటారని, భవిష్యత్తు మొత్తం అంధకారం అవుతుందన్నారు.పాఠశాలలు, కళాశాలల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు సేవిస్తున్నా, పెడ్లర్స్ సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నెంబర్కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఏఎస్పీ నక్కా సూర్యచంద్ర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జె. అమృతం,జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకట లక్ష్మమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ భాషా, ఎక్సయిజ్‌శాఖ సూపరింటెండెంటు ఏ.ఆవులయ్య, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.రామ కుమార్, జిల్లా ప్రజా రవాణాధికారి షబ్నమ్,ఈగిల్ టీమ్ ఇంచార్జి బి.ఉదయభాస్కర్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# 15 నెలల్లో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు

**- సుమారు రూ.8 కోట్ల సిఎం సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం**
**- పార్టీ విధేయులకు పట్టం కట్టిన టిడిపి తఅధిష్టానం**
**: మంత్రి పార్థసారధి**




**నూజివీడు,మేజర్‌న్యూస్ :** నూజివీడు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి, గ్రామ పార్టీ అధ్యక్ష పదవులు బూత్ ఇంచార్జ్‌లను ఎన్నికొని రాష్ట్ర సమాచార , గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం జరిగింది.మంత్రిమాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ పార్టీ అధ్యక్షులు కార్యదర్శులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తెలుగుదేశం సభ్యులు అందరూ కలసి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి పని చేయాలన్నారు. తెలుగుదేశానికి కార్యకర్తలు వెన్నుముఖ అని మూల స్తంభమని అన్నారు.మీ రందరి కృషి మూలముగానే పార్టీ ఇంతటి ఘన విజయం సాధించిదన్నారు. పార్టీ లో బిన్న అభిప్రాయాలు సర్వసాధారణం అని అందరిని కలుపుకొని ముందుకు వెళ్లాలన్నారు. మాజీ శాసన సభ్యులు వారి ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి సంక్షేమం జరిగింది అనడం హాస్యపదం అన్నారు.వాళ్ళు ఇచ్చిన పథకాలన్నీ మేము ఇచ్చే పింఛన్లతో సమానం అన్నారు. అభివృద్ధి సంక్షేమం పై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు.ఈసందర్భంగా ఎన్నిక కాబడిన వివిధ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మామీద నమ్మకంతో మమ్మును ఆశీర్వదించి ఇంతటి గురుతర బాధ్యత మాకు అందించిన రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖమంత్రి కొలుసుపార్థ సారధి ఈ బాధ్యతను అదృష్టంగా భావించి క్రమ శిక్షణతో తెలుగుదేశం పార్టీకి కూటమి ప్రభుత్వానికి క్రమ శిక్షణతో మేమంతా పని చేసి ప్రజలకు అందుబాటులో ఉంటామని అన్నారు.ఈకార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీఅధ్యక్షులు నూజివీడు నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, రఘు, వాసు, శ్రీనివాసు, వేణు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంలో కేంద్ర బృందం పర్యటన





**- ప్రాజెక్ట్ నిర్మాణ తీరును పరిశీలించిన కేంద్ర బృందం**

**పోలవరంమేజర్‌న్యూస్ :** పోలవరం ప్రాజెక్ట్ ను శుక్రవారం కేంద్ర జల సంఘం ప్రతినిధులు పరిశీలించారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర జల సంఘం డిజైన్లు, పరిశోధన విభాగం ఎక్సఫిషియో సభ్యుడు ఆదిత్య శర్మ, కేంద్ర జల సంఘం చీఫ్ ఇంజనీర్ ఎస్ ఎస్ భక్షితో పాటు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం. రఘురాం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్ట్ లో జరుగుతున్న పనులను వారు ఆసాంతం పరిశీలించారు. వారికి జలవనరుల శాఖ ఈ ఎన్ సి కె నరసింహామూర్తి, పోలవరం ఎస్ ఈ కె రామచంద్ర రావు, క్వాలిటీ కంట్రోల్ విభాగం సిఈ కె శేషుబాబు, డీఈలు కెబాలకృష్ణ, డి.శ్రీనివాస్, ప్రేంచంద్ ,ఎంఈఐఎల్ జీఎం ఏగంగాధర్, డీజీఎం మురళి తదితరులు పనులు జరుగుతున్న తీరును చూపించటంతో పాటు వివరాలు అందించారు. పోలవరం ప్రాజెక్ట్ వ్యూ పాయింట్ నుంచి మొత్తం పనుల వివరాలను కేంద్ర బృందానికి జలవనరులశాఖ, కాంట్రాక్టు సంస్థ ఎంఈఐఎల్ ప్రతినిధులు వివరించారు. ఆ తరువాత వారు మోడల్ డ్యామ్ పరిశీలించారు. అక్కడ ప్రతి విభాగం గురించి అధికారులు తెలిపారు. స్పిల్ వే చేరుకున్న కేంద్ర బృందం మొత్తం పరిశీలించింది. స్పిల్ వే, గేట్లు, గేట్లను ఆపరేట్ చేసే సిలిండర్లు, పవర్ పాక్స్ మొదలైన వాటి పనితీరు గురించి వారు తెలుసుకున్నారు.

ప్రాజెక్ట్ అప్ స్ట్రీమ్ కాఫర్ డాం,గ్యాప్ 1, డయాఫ్రమ్ వాల్, జల విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించారు. ప్రతి ఒక్క దగ్గర అధికారులను అడిగి పనుల వివరాలు తెలుసుకున్నారు.

# శ్రీ దేవి జానకి థియేటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జెసి



**మొగల్తూరు,మేజర్ న్యూస్ :** శ్రీదేవి జానకి థియేటర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సినిమా థియేటర్ ఆకస్మిక తనిఖీలో భాగంగా ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అమలు చేయవలసిన అగ్నిమాపక భద్రత, విద్యుత్ వైరింగ్,జనరేటర్, ఇతర భద్రతా ప్రమాణాలను ఆయన పరిశీలించారు. ప్రేక్షకులకు తగిన ఏర్పాట్లు వసతులు పరిశుభ్రత ,నీటి లభ్యత టాయిలెట్స్ వంటి సౌకర్యాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి,మాట్లాడుతూ అగ్నిమాపక సిలిండర్లను ప్రస్తుతం ఉన్న వాటికన్నా ఎక్కువ పెంచాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించినటిక్కెట్లు రేట్లు అధిక ధరలకు విక్రయించిన యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జె సి వెంట తాహసిల్దార్ రాజ్ కిషోర్, రెవిన్యూ సిబ్బంది, థియేటర్ యాజమాన్యం తదితరులు ఉన్నారు.

# ఆత్మహత్యకు పాల్పడిన గురుకుల పాఠశాల విద్యార్థిని కావ్య

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థి శుక్రవారం కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విషాధ సంఘటన జరిగింది. క్లాస్ రూమ్‌లో విద్యార్థి పొడపాటి కావ్య అనే విద్యార్థిని మధ్యాహ్నం భోజనం సమయంలో అందరూ బయటకు వెళ్లిన సమయంలో వారితో పాటు బయటకు వెళ్లి భోజనం చేసే ప్లేటు మర్చిపోయాను తీసుకు వస్తాను అని మరల క్లాస్ రూమ్‌కు వెళ్లింది. క్లాసు రూములో ఎవరూ లేని సమయంలో వెనుక భాగంలో ఉన్న టేబుల్ పైకి ఎక్కి తన మెడలో ఉన్న యూనిఫామ్ చున్నీతో అదే క్లాస్ రూమ్‌లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సీసీటీవీ ఆధారంగా ఉరి చేసుకోవడం జరిగిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ సుభాష్ గుర్తించారు. మృతురాలు జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిగా గుర్తించారు. ఆత్మహత్యకు పాల్పడిన కావ్యను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో స్కూల్స్ సిబ్బంది తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు తల్లి డయాలసిస్ రోగి కాగా తండ్రి డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సంఘటన స్థలానికి ఎస్ఐ ప్రసాద్ వెళ్లి పరిశీలన ప్రారంభించారు మృతురాలు తల్లి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో తనకు దిక్కు లేదనే భావనతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నారు.కావ్య మృతితో జొన్న వారి గూడెం కాలనీవాసులు అంతా ఒక్కసారిలో మునిగిపోయారు.

# వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చిన్నం ఏడుకొండలు



**పెనుగొండ,మేజర్‌న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలను అధిష్టానం ఎంపిక చేయడంతో శుక్రవారం పలువురు వైయస్సార్సీపి నాయకులు ఆయనను అభినందించారు.

ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ మాజీ మంత్రివర్యులు, చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో పార్టీ అధిష్టానం నన్ను గుర్తించి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మాజీ మంత్రివర్యులు శ్రీ రంగనాథరాజు, కార్యకర్తలు, నాయకులతో కలిసి పార్టీ విజయానికి తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.